కాపు నేస్తంతో 1,510 మందికి లబ్ధి

ప్రజాశక్తి-పాడేరు : జిల్లాలో 1510 మంది వై ఎస్ ఆర్ కాపునేస్తం లబ్దిదారులకు రూ.2 కోట్ల 26 లక్ష 50 వేల లబ్ది చేకూరిందని జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు స్పష్టం చేసారు. కాపు నేస్తం లబ్దిదారులకు నమూనా చెక్కును పంపిణీ చేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నుండి వై ఎస్ ఆర్ కాపునేస్తం నాలుగవ విడత నిధులు విడుదల ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ నుండి వీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కాపు నేస్తాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. ఈ కార్య క్రమంలో డిఆర్‌డిఏ పిడి వి.మురళి, బిసి కార్పోషన్ ఎఇఓ కె.శంకర్, కాపు నేస్తం లబ్దిదారులు పాల్గొన్నారు.

చెక్‌ను అందజేస్తున్న అధికారులు

ఉక్కు రక్షణ యాత్రను జయప్రదం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స

ప్రజాశక్తి- పాడేరు:విశాఖ ఉక్కు పరిరక్షణ యాత్ర ను జయప్రదం చేయాలని సి.పి.ఎం జిల్లా కార్యదర్శి పి.అప్పల నర్స పిలుపునిచ్చారు. పాడేరు సి.పి.ఎం కార్యాలయంలో శనివారం ఉక్కు రక్షణ యాత్ర పోస్టర్‌ను పార్టీ మండల కార్యదర్శి ఎల్ సుందరరావు, పి.లక్కు తో కలిసి జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయాలని నిర్ణయించారన్నారు. దీనికి వ్యతిరేకంగా స్టీల్ ప్లాంట్ కార్మికులు గత వెయ్యి రోజులుగా పోరాడు తున్నారన్నారు. రాష్ట్రవ్యాపితంగా బందులతో సహా వివిధ రూపాలలో జరిగిన పోరాటాలలో రాష్ట్ర ప్రజానీకం విశాల మద్దతు లభిస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల మద్దతు కూడగట్టి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాలేదన్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీలు రాష్ట్ర అధికార పార్టీని విమర్శిస్తున్నాయి తప్ప ప్లాంట్‌ను అమ్మేయాలని నిర్ణయించిన కేంద్ర ప్రభుత్వాన్ని పల్లెత్తుమాట కూడా అన లేదని తెలిపారు. దీనిని అదునుగా తీసుకొని నరేంద్రమోడీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ను సామర్ధ్యంతో నడప లేదని మూడవ బ్లాస్ట్ పర్నేస్ ను మూసివేసిందనీ ఆక్సిజన్ ప్లాంట్ను ప్రైవేటీ సంస్థలకు అప్పజెప్పుతోందని విమర్శించారు. .సొంత గనులను కేటాయించ లేదని, దిగుమతి చేసుకున్న ముడిసరుకును అన్లోడ్ చేసి స్టీల్ప్లాంటు ఇవ్వడానికి గంగవరం పోర్టు ఉద్దేశ్య పూర్వకంగానే ఇబ్బందులు పెడుతోందని దుయ్యబట్టారు.ఇప్పటికే 1400 ఎకరాల స్టీల్ ప్లాంట్ జోన్ను గంగవరం పోర్టుకు ఇచ్చారని మరిన్ని భూములను ధారదత్తం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజానీకాన్ని చైతన్య పరచాలనే ఉద్దేశ్యంతో సిపిఎం ఈ నెల 20 నుండి 29 వరకు 10 రోజులు ఉత్తరాంధ్ర 6 జిల్లాల్లో మోటార్ సైకిల్ యాత్ర చేపట్టిందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో 25న అరకు, పాడేరు 26న చింతపల్లి మీదగా నర్సీపట్నం కు యాత్ర సాగుతుందని అన్నారు. ఈ యాత్రలో విద్యావంతులైన ప్రజలు, విద్యార్థులు, మేధావుల భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం నాయకులు బత్తిరి నరేష్, మత్య రాజు, సింహాద్రి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అప్పలనర్స, నాయకులు

ప్రజారోగ్యం ప్రశ్నార్థకం

వైద్యసేవలు మృగ్యమౌతున్నా పట్టించుకోరా..?

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు

మాట్లాడుతున్న సిపిఎం నేత నాగేశ్వరరావు

ప్రజాశక్తి- కూనవరం : ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో, ముఖ్యంగా ఏజెన్సీలో ప్రజారోగ్యం, ప్రభుత్వ వైద్యసేవలు ప్రశ్నార్థకంగా మారాయిన సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు విమర్శించారు. శనివారం శ్రీమార్తా శ్రీరామ్మూర్తి భవన్‌లో నిర్వహించిన సిపిఎం సమావేశంలో మాట్లాడుతూ కోతులగుట్ట పిహెచ్‌సిలో రూ.కోట్ల ప్రజాధనంతో అన్ని రకాల వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నప్పటికీ వైద్యులు లేక వైద్యసేవలు మృగ్యమౌతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక ప్రక్క వరదలు, మరోవైపు వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండడమే కాకుండా ఏటా సీజన్‌లో విషజ్వరాలు ప్రబలి ప్రజల ప్రాణాలు పోతున్నా, వైద్యసేవలు మెరుగుపరిచే చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. ప్రతిరోజూ సిహెచ్‌సికి 200 మందిదాకా అవుట్‌పేషెంట్లు వస్తున్నా, వైద్యులను నియమించక, ఆరోగ్యసేవలను మెరుగుపరచడంతో ప్రభుత్వం అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. సిహెచ్‌సికి వచ్చిన వైద్యులు ఎక్కువ కాలం ఉండకుండా ఎందుకు వెళ్లిపోతున్నారో వైద్యఆరోగ్యశాఖ అధికారులు పరిశీలన జరిపి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఇక్కడ వైద్యులు లేని కారణంగా భద్రాచలం, కాకినాడ, రంపచోడవరం వంటి దూరప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకునే దుస్థితికి విముక్తి కల్పించాలని కోరారు. మండలంలోని ప్రతి కుటుంబానికి దోమతెరలు ఇవ్వాలని, దోమల నివారణి మందు పిచికారి చేయాలని డిమాండ్ చేశారు.. సమావేశంలో తాళ్లూరి శ్రీనివాసరావు,మడం బాబురావు, కొండ ఈశ్వర్లు,జక్కుల వీరబాబు, ఎడ్ల వెంకన్న బాబు పాల్గొన్నారు.

ఎటిడబ్లుఒకువినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గర్ల్స్ హాస్టల్స్‌లో సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-పాడేరు: హుకుంపేట మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల వసతి గృహంలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.చిన్నారావు గిరిజన సంక్షేమ అధికారులను కోరారు ఈ మేరకు శనివారం పాడేరులో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు సహాయ గిరిజన సంక్షేమ అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాల బాలికల వసతి గృహంలో విద్యార్థినీలు వసతి సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. సరిపడిన వసతి సాకర్యం లేక ఇబ్బందికి గురవుతున్నారని చెప్పారు, మరుగుదొడ్లు, తాగునీటి సమస్య కూడా ఉన్నాయని దీనిపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. కస్తూర్బా , జిటి డబ్ల్యూ ఇంగ్లీష్ మీడియం ఆశ్రమం పాఠశాలలో భవనాల కొరతతో విద్యార్థుల నిద్రించడానికి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలేజీ, ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మెనూ అమలు చేయలేదన్నారు. విద్యార్థులకు కాస్మోటిక్స్ చార్జీలు ఇవ్వాలన్నారు. విద్యార్థులు గజ్జి, తామర, రక్తహీనత బాధపడుతున్నారని తెలిపారు. వెంటనే హాస్టల్స్‌లో మెడికల్ క్యాంపు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే స్పందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పి చిన్నారావు డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు.ఎస్.మత్సరాజు, బి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యపై గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలోని గసభ పంచాయితీ లోగిలి, సాగర పంచాయతీ పొడ్డగుడ గ్రామాల సరిహద్దు మధ్యనున్న భూ సమస్యను వెంటనే శాశ్వతంగా పరిష్కారం చేయాలంటూ లోగిలి గ్రామస్తులు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. రెండు గ్రామాల మధ్య గొడవలు తారాస్థాయికి చేరుకోకుండా శాశ్వత పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని గిరిజనులు నినాదాలు చేశారు. లోగిలి గ్రామానికి చెందిన భూముల్లో ఆ గ్రామస్తులు పంటలు సాగు చేశారు. పొడ్డగూడ గ్రామస్తులు ఆ భూములలో కొచ్చి సాగు చేసిన పంటలను ధ్వంసం చేస్తున్నారని, అడ్డుకోవడానికి వెళ్లిన వారిపై దాడులకు పాల్పడుతున్నారని ఆ గ్రామస్తులు చెప్పారు. భూ సమస్య పరిష్కరించాలని పలుమార్లు ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చేయకపోవడంతో ఇరు గ్రామాల మధ్య గొడవలు జరుగుతున్నాయని లోగిలి గ్రామస్తులు తెలిపారు. పోడ్డగూడ గ్రామ స్థలం నుంచి తమ భూములకు రక్షణ కల్పించడంతో పాటు లోగిలి ప్రజలకు కూడా రక్షణ కల్పించాలని ఆ గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని లోగిలి గ్రామస్తులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామస్తులు కె.గోవర్ధన్, పి.రఘురాం, సహదేవ్ ,అర్జున్ పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న గిరిజనులు

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న నరసింహులు

ప్రజాశక్తి- చింతూరు: ఉపాధి హామీ పథకంలోని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరంధామయ్య, నరసింహులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం చింతూరు డివిజన్ పరిధిలో ఉన్న నాలుగు మండలాల ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ చట్టాన్ని నిర్వర్యం చేస్తూ ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం అమలు చేయడం లేదున్నాఉ. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి కనీసం నిధులు పెంచకుండా మొండిగా వ్యవహరిస్తోందన్నారు. గత 17ఏళ్లుగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్‌చేశారు.

ఈ సందర్భంగా ఫీల్డ్‌అసిస్టెంట్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా అప్పారావు, కార్యదర్శిగా రామకృష్ణ, కోశాధికారిగా శంకర్, వీరితో పాటు ఇంకో పది మందినికమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పోడియం లక్ష్మణ్. ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రీపతి పొద్దయ్య. రామరాజు. పద్మ. సూరమ్మ. పాల్గొన్నారు.

రెగ్యులేటరీ గేట్లు మరమ్మతుతో నీరు వృథా

అదనపు విద్యుదుత్పత్తితో నీటి వృథాను అరికట్టిన జెన్‌కో అధికారులు

ఎంబ్యాంక్‌పై నుంచి వృథాగా పోతున్న డొంకరాయి రిజర్వాయర్ నీరు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే రెగ్యులేటరీ డ్యాం గేట్లు కిందకు దిగిపోవడంతో చింతపల్లి క్యాంప్ సమీపంలో ఉన్న ఎంబ్యాక్ పైనుంచి నీరు వథాగా దిగువ ప్రాంతానికి శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు పోయింది. గ్రిడ్ ఆదేశాల మేరకు సీలేరు జల విద్యుత్ కేంద్రంలో శుక్రవారం రాత్రి రెండు యూనిట్లు నుంచి విద్యుదుత్పత్తి నిరాటంకంగా కొనసాగించారు. సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో నాలుగు యూనిట్లు ఉండగా, ఒక యూనిట్ పూర్తిస్థాయి మరమ్మతులు గురైంది. మిగతా మూడు యూనిట్లులో రెండవ నెంబరు యూనిట్‌లో హైడ్రాలిక్ ఆయిల్ పంపు ఊడిపోవడంతో సాంకేతిక లోపాలు తలెత్తి యూనిట్ నుంచి విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. జెన్‌కో ఇంజనీర్లు యూనిట్లో సాంకేతిక లోపాల్ని పరిశీలించి, యుద్ధ ప్రాతిపదికన యూనిట్ హైడ్రాలిక్ ఆయిల్ పంపు ఊడిపోయి ఆయిల్ లీకేజీకి మరమ్మత్తులు చేసి అందుబాటులో తీసుకొచ్చారు.

శనివారం ఉదయం ఎపి జెన్‌కో ఇఇ ప్రభాకర్, ఎడిఇ అప్పలనాయుడు వథాగా నీరు పోతున్న ఎంబ్యాక్ దగ్గరికి చేరుకొని పరిశీలించారు. అనంతరం రెగ్యులేటరీ డ్యాము గేట్లు దింపేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. అయినప్పటికీ గేట్లు కిందికి దిగలేదు.

దీనిపై ఇఇ ప్రభాకర్‌ను వివరణ కోరగా రెగ్యులేటరీ రెండు, మూడు, ఆరు, గేట్లు మరమత్తులకు అంచనా ప్రతిపాదనలు సిద్ధంగా ఉంచామని తెలిపారు. ఒకటి, ఏడు, ఎనిమిది గేట్లుకు టెండర్లు పిలిచామని మోతుగూడెం కాంట్రాక్టర్ పనులు చేపట్టవలసి ఉందన్నారు. నాలుగు ఐదు గేట్లు ఇప్పటికే మరమ్మతులు పూర్తి చేసామని ఇఇ ప్రభాకర్ వెల్లడించారు. డొంకరాయి రిజర్వాయర్‌లో నీటిమట్టలు అధికంగా ఉండడంతో పోల్లూరు జల విద్యుత్ కేంద్రం నుంచి విద్యుదుత్పత్తి నిరాటకంగా జరుగుతుందన్నారు. సీలేరు జలవిద్యుత్ కేంద్రాల నుంచి పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తికి గ్రిడ్ నుంచి ఆదేశాలు లేకపోవడంతో ఇంటెక్ డ్యామ్ లో నీటి నిలువలు పెరిగి చింతపల్లి సమీపంలో్న ఏం బ్యాక్ పైనుంచి కొంతవరకు నీరు వథాగా పోయిన విషయం వాస్తవమేనన్నారు. శనివారం ఉదయం జల విద్యుత్ కేంద్రంలో మూడు యూనిట్లు నుంచి విద్యుదుత్పత్తి చేయడంతో నీటి వినియోగం పెరిగి, ఎం బ్యాక్ పైనుంచి వథాగా పోతున్న నీరుని అరికట్టగలిగామనితెలిపారు.

గేట్లు కిందకు దిగక, దిగువకు పోతున్న నీరు

మళ్లీ డొంకరాయి జలాశయం నీరు విడుదల

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి జలాశయం నుంచి శనివారం తెల్లవారుజామున నీటి విడుదలను నిలుపుదల చేసిన ఎపి జెన్‌కో అధికారులు, సాయంత్రం మళ్లీ మరోసారి నీటిని విడిచి పెట్టినట్లు అధికారులు వెల్లడించారు. వారం రోజుల నుంచి డొంకరాయి పరిసర ప్రాంతాల్లో విస్తీరంగా వర్షాలు కురవడంతో వరద నీరు అధికంగా చేరిన సంగతి తెలిసిందే. దీంతో జెన్‌కో అధికారుల అప్రమత్తమై గేటు ద్వారా దిగువ ప్రాంతానికి తొమ్మిది వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అయితే వర్షాలు తగ్గుముఖం పట్టడంతో జలాశయంలో నీటిమట్టలు క్రమేపి తగ్గింది. దీంతో శనివారం తెల్లవారుజామున నీటి విడుదల నిలిపేశారు. అయితే సాయంత్రానికి జలాశయానికి ఇన్‌ఫ్లో పెరగడంతో రెండుగేట్లు ఎత్తి, 3250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఎపి జెన్‌కో ఇన్‌చార్జి ఎస్ఇ వరప్రసాద్ తెలిపారు.

శనివారం ఉదయానికి డొంకరాయి జలాశయంలో 1035.4 అడుగులు నీటిమట్టలు నిలకడగా ఉండడంతో గేట్లు ద్వారా నీటిని నిలిపివేశారు. పవర్ కెనాల్ నుంచి 2800 క్యూసెక్కుల నీటిని యధాతధంగా పోల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి విద్యుదుత్పత్తికి నీటి విడుదల కొనసాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సీలేరు డొంకరాయి, బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో నీటి మట్టాలు నిలకడగా ఉన్నాయని జెన్‌కో అధికారులు వెల్లడించారు.

గిరిజనులతో మాట్లాడుతున్న డిఎం అండ్ హెచ్‌ఒ

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

డిఎంఅండ్‌హెచ్‌ఓ జమాల్ బాషా

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో ప్రతి ఒక్క నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని అల్లూరి జిల్లా డిఎం అండ్ హెచ్ ఓ జమాల్ బాషా చెప్పారు. మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని నూతనంగా ప్రవేశపెట్టిందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకొని ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, ఆరోగ్యవంతంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏఎస్ నోడల్ ఆఫీసర్ రమేష్, ఎంపీఈవో శౌరి, హెల్త్ అసిస్టెంట్ ఎస్ స్వామి, వైద్య సిబ్బంది ,ఆశ కార్యకర్త సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు:అరడకోట పంచాయతీ పురుగోడుపుట్టు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రభాలే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు చిట్టాపలి సిందూరం పడాల్ తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్స్ వంతల మూర్తి, కైలాష్ బాబు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ లేక రోడ్డుపై ఉన్న వేచి వున్న గిరిజనులు

బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -పెదబయలు రూరల్ : గోమంగిలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ సభ్యులు కొంట సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ప్రయాణికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 20 సంత్సరాల నుండి ఈ ప్రాంతంలో సరైన రోడ్, బస్సు లేక ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. బస్ షెల్టర్ లేక ప్రయాణికులు ఎండకు, వానకు తడుస్తూ బస్సు కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అదికారులు స్పందించి బస్ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందించాలి

కేంద్ర ఫుడ్ కమిటీ బృందం విస్తృత పర్యటన .. ఆశ్రమ పాఠశాలలు, అంగన్వాడీలు రేషన్‌డిపోల సందర్శన

ఆశ్రమ పాఠశాల సందర్శనలో కేంద్ర బృందం సభ్యులు

ప్రజాశక్తి -రంపచోడవరం : ఏజెన్సీలోని వివిధ పాఠశాలలు,.అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహార పదార్థాలు పెట్టాలని భారత ఫుడ్ కమిటీ సభ్యులు డాక్టర్ ఉపేంద్రసింగ్ సూచించారు. శనివారం రంపచోడవరం మండలం ఇర్లపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను డాక్టర్ ఉపేంద్ర సింగ్,. డాక్టర్ రామ్ నెటర్ విజయ్, యస్. సైవుద్దీన్ ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ఆశ్రమ పాఠశాల స్టోర్ రూమును పరిశీలించారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఉపేంద్ర సింగ్ మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలలు, అంగన్వాడీలకు ప్రభుత్వాలు నిర్ధేశించిన మెనూ ప్రకారం ఆహార పదర్థాలను అందించడం ద్వారా వారిలో పౌష్టికాహార లోపం, రక్తహీనత లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులకు, వారి క్వార్టర్స్ తదితర విషయాలపై ఆరా తీశారు..అనంతరం వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు ఆహారం పదార్థాలు ఏవిధంగా వండి,వడ్డిస్తున్నదీ పరిశీలించడంతోపాటు ఆహార పదార్థాల రుచి చూశారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని నిత్యవసర వస్తువుల స్టాక్ పాయింట్లు, ఆశ్రమ పాఠశాలలు, అంగన్వాడీకేంద్రాలు, జిసిసి డిఆర్‌డిపోలను పరిశీలిస్తామన్నారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, డివిజనల్ సివిల్ సప్లై అధికారి సి. శ్రీహరి, ఎటిడబ్ల్యూఒ రామతులసి, హెచ్‌ఎం రాజేశ్వరి, ఫిజికల్ డైరెక్టర్ రామయమ్మ, జెఎడియస్.వసంతకుమారి పాల్గొన్నారు.

పోలీసుల చొరవతో రోడ్డు గోతులు పూడ్చివేత

సిమెంట్ కాంక్రీట్‌తో రోడ్డులోని గోతులను కప్పిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- అడ్డతీగల : అడ్డతీగల, వేటమామిడి ప్రధాన రహదారిలో ప్రమాదభరితంగా ఉన్న గోతులను సిఐ రాంబాబు, ఎస్ఐ అప్పలరాజు చొరవతో పూడ్చివేత చర్యలు శనివారం చేపట్టారు. రోడ్డులో భారీగా గోతులు ఉండడంతో ప్రజలు, వాహనదారులు రాకపోలకు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో, సమస్యలను గమనించిన సిఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని, వాటికి తాత్కాలికంగా పూడివేసే చర్యలకు మందుకొచ్చారు. సిఐ రాంబాబు, ఎస్ఐ అప్పలరాజు, ఇతర సిబ్బంది మూర్తి, సత్తిబాబు, హోంగార్డు కోటి తదితరులు స్వీయపర్యవేక్షణలో రోడ్డులోని గుంతలను సిమెంట్ కాంక్రీటుతో పూడ్చివేసే పనులను చేపట్టారు. తాపీ మేస్త్రి దాకుమూరు శ్రీను, బృందం పోలీసులకు సహకరించారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు ముందుకొచ్చిన సిఐ రాంబాబుకు ఎస్ఐ అప్పలరాజుతదితరులకు వాహనదారులు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు

అక్రిడిటేషన్‌కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -పాడేరు: పెండింగ్ లో ఉన్న అర్హులైన పాత్రికేయులకు రెండవ విడత అక్రిడిటేషన్ కార్డుల జారీకి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి పి.గోవింద రాజులు తెలిపారు. మొదటి విడతలో 120 మంది అర్హులకు కార్డులు జారీ చేయడం జరిగిందని, ఆన్లైన్‌లో ఇంకనూ దరఖాస్తులు పరిశీలించడం జరుగుతుందని వివరించారు. ఇంకా అర్హతలు కలిగి ఉండి దరఖాస్తు చేసుకోలేని వారు, అర్హతల మేరకు ఈ నెల 25 వ తేదీ లోపు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డిపిఆర్ఓ సూచించారు. ఫ్రీలాన్స్ జర్నలిస్టులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకొని హార్డ్ కాపీ అందజేయాలన్నారు. వర్కింగ్ జర్నలిస్టులు వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీంకు దరఖాస్తు చేసుకోవచ్చని డిపిఆర్ఓ తెలిపారు. జర్నలిస్టులు రూ.1250లు చలాన ద్వారా చెల్లిస్తే, మిగిలిన రూ.1250లు ప్రభుత్వం తరుపున సమాచార శాఖ చెల్లిస్తుందని వివరించారు.

పాడేరులో కాగడలతో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి రిలే దీక్షలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మాజీ సిఎం చంద్రబాబు అక్రమ అరెస్ట్ ను నిరసనగా నాలుగవ రోజు శనివారం మాజీ ఎమ్మెల్యే, పాడేరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాడేరులో రిలేదీక్షలు కొనసాగించారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో దీక్షలో పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడిని వెంటనే విడుదల చేయాలని, సిఎం జగన్ డౌన్ డౌన్ అనే నినాదాలతో పురవీధులను దీక్షలో ప్రదర్శించారు. అనంతరం పట్టణంలో కొవ్వొత్తులు, కాగడాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ...మాజీ సిఎం చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టిడిపి తలపెట్టిన రిలే దీక్షలకు ప్రజల నుండి అనూహ్యంగా లభిస్తున్న మద్దతును చూసి వైసిపి నేతల్లో వణుకు ప్రారంభమైందని అన్నారు. చంద్రబాబు నాయుడు నిర్దోషిగా బయటకు వస్తారని తెలిపారు.

మైక్రోస్కోపును అందజేస్తున్న పిఒ

మైక్రోస్కోపుల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు : గిరిజను ఆరోగ్య రక్షణకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు వేగంగా పూర్తి చేయాలని ఐటిడిఎ పి ఓ వి. అభిషేక్ ఆదేశించారు. ఐటిడిఎ నిధులతో కొనుగోలు చేసిన ఐదు మైక్రో స్కోప్ యంత్ర పరికరాలను శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్లకు పంపిణీ చేసారు. పెదబయలు, రాజంగి, ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, అరకు వ్యాలీ సహాయ మలేరియా అధికారి కార్యాలయానికి, జిల్లా మలేరియా అధికారి కార్యాలయానికి మైక్రో స్కోపులను కేటాయించామని చెప్పారు. మలేరియా పరీక్షలు, క్షయ నిర్ధారణ, మూత్ర పరీక్షలు, ఫులుపరీక్షలు .. వీర్యకణాల పరీక్షలు చేయడానికి వినియోగించి సకాలంలో రిపోర్టులు ఇవ్వాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ రక్త పరీక్షలను ప్రజల నుంచి సేకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పి. ఎస్. ఎస్. ప్రసాద్ , ల్యాబ్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు .

తప్పుడు ధ్రువీకరణ పత్రం ఇచ్చిన అధికారులను తొలగించాలి

మాట్లాడుతున్న శాంతకుమారి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: అరకులోయలో పిట్టల రాంబాబు అనే గిరిజనేతరుడికి నకిలీ ఎస్టి కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేసిన సంబంధిత అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ ఆదివాసి విభాగ చైర్ పర్సన్ పి.శాంతకుమారి డిమాండ్ చేశారు. మండలంలోని తూటంగి పంచాయతీ మాజీ పుట్టు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అసలైన గిరిజనులు కళాశాలలో చదువుకోవడానికి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరుకు దరఖాస్తులు చేస్తే జాప్యం చేసే అధికారులు గిరిజనేతరులకు మంజూరు చేశారన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు దీనిపై విచారణ చేసి నకిలీ ధ్రువపత్రం మంజూరు చేసిన సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేసి ,విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర పతినిధి పి.చిన్నస్వామి, రాష్ట్ర కోఆర్డినేటర్ సోమేశ్వరరావు, మండల అధ్యక్షుడు జి.జగన్నాథం, ప్రధాన కార్యదర్శి పరశురాం, నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిపైనా ఉందని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ అన్నారు. స్థానిక కెజిబివి పాఠశాలలో కాలుష్య నియంత్రణ మండలి, సాక్షి దిన పత్రిక సంయుక్తంగా శనివారం నిర్వహించిన మట్టి వినాయక ప్రతిమలు తయారీ పోటీల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , రసాయనిక పదార్ధాలలో వినాయక విగ్రహాలు తయారు చేయడంతో నీటి కాలుష్య పెరిగి జల చరాలకు హాని కలుగుతుందన్నారు. మట్టి వినాయక ప్రతిమలు తయారీపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. 1500 వందల సంవత్సరాల నుండి భారత దేశంలో వినాయక ఉత్సవాలను నిర్వహిస్తున్నారని స్పష్టం చేసారు. 1990లో మట్టి వినాయక విగ్రహాలు తగ్గి రసానిక పధార్ధాలతో విగ్రహాలు తయారు చేయడం మొదలు పెట్టారని చెప్పారు. మద్రాసులో విగ్రహాల నిమజ్జనంలో చెరువులలో మత్స్య సంపద మృత్యు వాత పడటంతో కొంత మంది కోర్టుకు వెళ్లడంతో రసాయనాలతో విగ్రహాలు తయారు చేయకూడదని మద్రాసు కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. వినాయక ప్రతిమల తయారీ పోటీలలో కెజిబివి విద్యార్థులు మొదటి బహుమతి, అక్షర పాఠశాల విద్యార్ధులు ద్వితీయ, లోచలిపుట్టు నెం.1 పాఠశాల తృతీయ బహుమతులను సొంతం చేసుకున్నారు. గుత్తులపుట్టు బాలికల ఆశ్రమ పాఠశాల,శ్రీకష్ణాపురం ఆశ్రమ బాలికల ఆశ్రమ , లోచలిపుట్టు ఆశ్రమ, కెజిబివి, అక్షర, మోదమాంబ పాఠశాల విద్యార్ధులకు కన్సోలేషన్ బహుమతులను అందజేసారు.ఈ కార్యక్రమంలో సహాయ గిరిజన సంక్షేమాధికారి ఎల్.రజని, హుకుంపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు, పాడేరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, డిటిడి ఓ కె.సూర్యకుమారి, స్పెషల్ ఆఫీసర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

24న న్యాయస్థానాల సముదాయం ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖ లీగల్ : నగరంలో గ్రీన్‌పార్కు హోటల్ పక్కన నూతనంగా నిర్మించిన న్యాయస్థానాల సముదాయాన్ని ఈ నెల 24వ తేదీన ప్రారంభించనున్నట్లు విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, విశాఖపట్నం పరిపాలన జడ్జి యు.దుర్గాప్రసాద్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి, సీనియర్ న్యాయవాదులు సమావేశమయ్యారు. న్యాయవాదులు, న్యాయమూర్తులు పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఏడేళ్ల క్రితం అప్పటి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జ్యోతిర్మయి ప్రారంభించిన న్యాయస్థానాల సముదాయ నిర్మాణం ఇప్పటికీ పూర్తయింది. ఈ సముదాయంలోకి కుటుంబ న్యాయస్థానాలు ఒకటి, రెండు, 10 క్రిమినల్ కోర్టులు బదిలీ చేస్తారు. దసరా సెలవుల అనంతరం కొత్త కోర్టులు అన్ని స్థాయిలలో పూర్తిగా పనిచేస్తాయి. ఈ భవన ప్రారంభోత్సవానికి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో పాటు ఇతర న్యాయమూర్తులు వస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసు, నమ్మి సన్యాసిరావు, పూర్వ అధ్యక్షుడు రవీంద్ర ప్రసాద్, కెఎస్ఎస్.సురేష్‌కుమార్, జి.సుమన్, సీనియర్ న్యాయవాదులు బగాది తులసీదాస్, సాయిబాబా, సుధాకర్, సిబిసిఐడిపిపి శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల క్రీడా పోటీల్లో యోగేష్ ప్రతిభ

ప్రజాశక్తి -ఆనందపురం : వికలాంగుల జిల్లా స్థాయి ఆటల పోటీలలో ఆనందపురం భవిత కేంద్రం విద్యార్థి ఇల్లిపల్లి యోగేష్ సాఫ్ట్ బాల్ ఆటలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ మేరకు జిల్లా విద్యా శాఖాధికారి చంద్రకళ బహుమతిని అందజేశారు. చినగదిలి మండలం తోటగురువు జిల్లా పరిషత్ హైస్కూల్లో వికలాంగుల జిల్లా స్థాయి ఆటల పోటీలు జరగగా ఆనందపురం మండలం నుంచి అయిదుగురు వికలాంగ విద్యార్థులు పాల్గొన్నారు. దుక్కవానిపాలెం గ్రామానికి చెందిన ఇల్లిపిల్లి యోగేస్ సాఫ్ట్‌బాల్‌లో ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో కలమట శ్రీనివాసరావు, నాగమణి తదితరులు యోగేష్‌ను అభినందించారు.

నేరాలు ఘోరాలు

5 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -కొత్తకోట:పాడేరు ఏజెన్సీ నుంచి పశ్చిమ గోదావరి జిల్లాకు కొత్తకోట మీదుగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తుల నుంచి ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు కొత్తకోట ఎస్ఐ విభూషణరావు తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల మేరకు ఉదయం ముందస్తు గా అందిన సమాచారం మేరకు కొత్తకోట గ్రామ సమీపంలో స్థానిక ఏఎస్ఐ సిబ్బందితో తనిఖీలు చేపట్టగా పాడేరు, తాడేపల్లిగూడెం గ్రామాలకు చెందిన ముగ్గురు యువకుల బ్యాగ్‌ల నుంచి ఐదు కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. చోడవరం కోర్టుకు తరలించామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం మత్సవానిపాలెం గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నంపేట గ్రామానికి చెందిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలు మేరకు.. కన్నంపేట గ్రామానికి చెందిన బలిజి కల్యాణం టి.అర్జాపురం గ్రామంలో పని ముగించుకొని తన బైక్ పై కన్నంపేట వస్తూండగా మత్సవానిపాలెం గ్రామ జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి ముందు వెళ్తున్న కారును బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కళ్యాణం కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు సకాలంలో స్పందించి కళ్యాణం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో పాటు 108 వాహనానికి కూడా సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు కళ్యాణాన్ని 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

క్రికెట్ స్టేడియంలో పనులు వేగవంతం

ప్రజాశక్తి-పిఎం.పాలెం : నవంబర్‌లో జరిగే ఇండియా- ఆస్ట్రేలియా మ్యాచ్‌ను దృష్టిలో ఉంచుకొని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ- విడిసిఎ క్రికెట్ స్టేడియంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఆర్.గోపినాథ్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఎసిఎ ట్రెజరర్ ఎవి.చలం, సీఈవో ఎంవి.శివారెడ్డి, విడిసిఎ వైస్ ప్రెసిడెంట్ జెకెఎం.రాజు, పిఎంసి కెకెఎస్.ప్రసాద్, గేమ్ డెవలప్‌మెంట్ జిఎం ఎంఎస్.కుమార్, జిఎం ఆపరేషన్స్ ఎస్ఎంఎన్.రోహిత్, ఎసిఎ ఇంజినీరింగ్ విభాగం, ఇతర సిబ్బందితో కలిసి స్టేడియాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియంలో చేపట్టాల్సిన పనులు, వసతులపై చర్చించి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. స్టేడియంలో పిచ్, గ్యాలరీ, కార్పొరేట్ బాక్సులు, లైటింగ్ తదితర చోట్ల చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు.

చిరస్మరణీయుడు పోతిన

ప్రజాశక్తి -మధురవాడ : తుది శ్వాసవరకు ప్రజల సమస్యలపై పోరాడిన నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పోతిన సన్యాసిరావు చిరస్మరణీయుడని పలువురు నాయకులు కొనియాడారు. మధురవాడ సిపిఐ కార్యాలయంలో పోతిన 39వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, మధురవాడ ప్రాంతంలో విద్య, వైద్యం, రహదారులు తదితర మౌలిక సౌకర్యాల కోసం కృషి చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. క్వారీ సొసైటీ స్థాపించి వందలాది మందికి ఉపాధి కల్పించారన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్వారీ అధ్యక్ష కార్యదర్శులు పిల్ల అప్పన్న, వాండ్రాసి రవికుమార్, నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పి.సుజాత, పి.సత్యనారాయణ, టిడిపి నాయకులు గొల్లంగి ఆనందబాబు, దాసరి శ్రీనివాస్, ఎన్.సూర్యప్రకాష్, నమ్మి నర్సింహులు, సిపిఐ ఏరియా కార్యదర్శి వి.సత్యనారాయణ, ఎమ్‌డి.బేగం, పి.కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు అందుబాటులో వైద్యం

ప్రజాశక్తి -ఆనందపురం : డాక్టర్ లక్ష్మణ్ రాయల్ సూపర్ స్పెషాలిటీ పోలి క్లినిక్ ద్వారా సామాన్యులకు వైద్యం అందుబాటులో ఉంచినట్లు డాక్టర్ బంటుబిల్లి లక్ష్మణరావు తెలిపారు. ఆనందపురం మండలం బంటుపల్లి కల్లాల రోడ్డులో డాక్టర్ లక్ష్మణ్ రాయల్ సూపర్ స్పెషాలిటీ పోలి క్లినిక్ హాస్పటల్‌లో ఫ్యామిలీ హెల్త్ కార్డ్‌లను శనివారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతంలో మధ్యతరగతి, సామాన్య ప్రజలకు వైద్యం అందించడమే ధ్యేయంగా హాస్పటల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హెల్త్‌కార్డు తీసుకున్నవారి కుటుంబానికి ఏడాది మొత్తం కన్సల్టెంట్ ఫీజు, టెలికాలింగ్ సౌకర్యం ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. జనరల్ కేర్, స్పెషలిస్ట్ ఆర్థో, న్యూరో కండిషన్స్, రీహెబిటేషన్ స్పెషలిస్ట్, కీళ్లు, నడుము నొప్పికి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్న వైభవ్ ప్రతినిధులు

22 నుంచి 'వైభవ్ జ్యూయలర్స్ పబ్లిక్ ఆఫరింగ్'

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ భారతదేశంలోని ప్రముఖ ప్రాంతీయ ఆభరణాల బ్రాండ్ వైభవ్ జ్యువెలర్స్ ప్రగతి పథాన దూసుకుపోతోంది. ఈ క్రమంలోనే సంస్థలో శనివారం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల్లోని మైక్రో మార్కెట్లలో13 షోరూమ్‌లను కలిగిన తమ సంస్థ జ్యువెలరీ మార్కెట్లో 4 శాతం వాటాను కలిగి ఉందని ప్రతినిధులు తెలిపారు. ప్రారంభ పబ్లిక్ ఆఫర్ కోసం ప్రైస్ బ్యాండ్ ఈక్విటీ షేరుకు 204 నుంచి 215 వరకు నిర్ణయించామన్నారు. కంపెనీ ప్రారంభ ఐపిఓ సబ్‌స్క్రిప్షన్ కోసం ఈ నెల 22న ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఇది అదే నెల 26తో ముగుస్తుందని వెల్లడించారు. పెట్టుబడిదారులు కనీసం 69 ఈక్విటీ షేర్లు, ఆ తర్వాత 69 ఈక్విటీ షేర్ల గుణిజాలలో వేలం వేయవచ్చునన్నారు. ఫ్లోర్ ధర ఈక్విటీ షేర్ ముఖ విలువ కంటే 20.4 రెట్లు, క్యాప్ ధర ఈక్విటీ షేర్ ముఖ విలువ కంటే 21.5 రెట్లు ఉంటుందని, ఈక్విటీ షేరు 10 ముఖ విలువ కలిగిన పబ్లిక్ ఇష్యూలో రూ. 210 కోట్ల వరకు విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేసినట్టు తెలిపారు. 2.8 మిలియన్ల ఒఎఫ్ఎస్‌గా ఉంటుందని తెలిపారు. వైభవ్ జ్యూయలర్స్ రిటైల్ షోరూమ్‌లు ఎక్కువగా టైర్ 2, టైర్ 3 నగరాల్లో ఉన్నాయని, విభిన్నమైన డిజైన్లలో బంగారు ఆభరణాలు, వజ్రాభరణాలు, రత్నాలు, ప్లాటినం, వెండి ఆభరణాలను విస్తృత శ్రేణిలో కలిగి ఉన్నట్టు తెలిపారు. సంస్థ గడిచిన 3 నెలల్లో రూ. 508.90 కోట్లు వ్యాపారం చేసి నికర లాభం రూ.19.24 కోట్లు సాధించినట్టు వెల్లడించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపడుతున్నట్లు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండలంలో 278 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు,. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఒడుగుల జ్యోతి, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచుల సమాఖ్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, ఎంపిడిఒ లోకుల యాదగిరిశ్వరరావు, స్థానిక తాహశీల్దార్ సుబ్రమణ్య ఆచారి, సీఐ షేక్ బాజీలాల్, ఎస్ఐలు టీజీ నరేంద్ర ప్రసాద్, రఘునాధరావు పాల్గొన్నారు.

డిజిటల్ భవిష్యత్తు వేగవంతం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఎడబ్ల్యుఎస్) ఆసియా పసిఫిక్ (హైదరాబాద్) ప్రాంతానికి క్లౌడ్ సేవల కోసం భారతదేశ ఎలక్ట్రానిక్ సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ నుంచి క్లౌడ్ సర్వీస్ ప్రొవైడర్ ఎంప్యానెల్‌మెంట్‌ను పొందినట్లు ఎడబ్ల్యుఎస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ప్రభుత్వ రంగం డైరెక్టర్, చీఫ్ టెక్నాలజిస్ట్ షాలినీ కపూర్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్లో మీడియాతో ఆమె మాట్లాడారు. 2030 నాటికి భారతదేశంలో క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో మొత్తం రూ.1,36,500 కోట్ల పెట్టుబడిలో భాగంగా నవంబర్ 2022 నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తోందన్నారు. దేశంలో డిజిటల్ భవిష్యత్తు వేగవంతమైందన్నారు.

బాబు అవినీతి డొంక కదలక మానదు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చంద్రబాబు చేసిన నేరాలలో తీగ మాత్రమే దొరికిందని, ఇక ఆయన అవినీతి డొంక కదలక మానదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బాబు స్కిల్ డెవలపమెంట్ సెంటర్ పెట్టాడా ? పెట్టినట్టు రుజువు చేస్తే రాజీనామా చేస్తా అని సవాలు విసిరారు. శనివారం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అవినీతి మీద చర్చకు రావాలని లోకేష్ పిలవడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఎవరెక్కడ ?

పొత్తులతో టిడిపి, జనసేనలో చర్చ
ఇరుపార్టీల్లో పెరిగిన ఆశావహులు
పంచకర్లకు పెందుర్తి కష్టమే

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

వచ్చే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీతో కలిసి పోటీ చేయబోతున్నామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన ప్రకటనతో ఎవరెక్కడ నుంచి పోటీ చేస్తారన్న చర్చ ఆ రెండు పార్టీల్లో ప్రారంభమైంది. అసెంబ్లీ నియోజకర్గాల్లో ఈ రెండు పార్టీల ప్రథమ శ్రేణి నాయకులు తమ పార్టీకి కేటాయిస్తారంటే, తమ పార్టీకి సీటు కేటాయిస్తారంటూ పార్టీ శ్రేణులకు చెప్పుకుంటున్నారు. ఎన్నికల నాటికి క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తల కలయిక ఎలా వుండబోతుందోగానీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఔత్సాహికుల్లో మాత్రం ఆందోళన ప్రారంభమైంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన వారిలో కొందరు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి కింది నుంచి ఏర్పాట్లు చేసుకుంటూనే సీటు కోసం గట్టి ప్రయత్నాలు ఆరంభించారు. సీటు కోసం మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు రెండు పార్టీలు మారారు. అనకాపల్లి, వి.మాడుగుల, చోడవరం నియోజకవర్గాల్లో టిడిపి నుంచి పోటీ చేయాలనుకునే నాయకులు ఇద్దరి నుంచి ముగ్గురు వున్నారు. దీనిపై కొద్ది రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశముందని ఆ పార్టీ నాయకులు భావిస్తుండగా తాజా పొత్తు ప్రకటన వీరిలో కాస్త ఆందోళనకు గురిజేసినట్లయింది.

జిల్లాలో యలమంచిలి నుంచి గత ఎన్నికల్లో జనసేన తరుపున పోటీచేసి ఓటమిపాలైన సుందరపు విజయకుమార్ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. టిడిపి నుంచి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావు సిద్ధమవుతున్నారు. వచ్చే ఎన్నికల్లో నాగేశ్వరరావు పోటీ చేస్తారన్న సంకేతాలు గతంలో జరిగిన పార్టీ సమీక్షా సమావేశంలో చంద్రబాబు స్పష్టంగా ఇచ్చారు. ఆ ఉత్సాహంతో నాగేశ్వరరావు పనిచేస్తున్నారు. పొత్తులో యలమంచిలి జనసేనకు కేటాయిస్తారని విజయకుమార్ ఆశిస్తున్నారు. గత ఎన్నికల్లో టిడిపి తరుపున యలమంచిలి నుంచి పోటీచేసి ఓటమిపాలైన పంచకర్ల రమేష్‌బాబు వచ్చే ఎన్నికల్లో పెందుర్తి నుంచి పోటీ చేయాలన్న ఆలోచనతో వైసిపిలో చేరి కొద్ది కాలం పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. ఆయనకు సీటు గ్యారెంటీ లేకపోవడంతో జనసేనలో చేరారు. ఆ పార్టీ నుంచి కూడా ఆయనకు స్పష్టమైన హామీ లభించనప్పటికీ పెందుర్తి నుంచి పోటీ చేస్తానన్న సంకేతాలు ఇస్తున్నారు. గతంలో ప్రజారాజ్యం పార్టీ నుంచి గెలుపొందిన రమేష్‌బాబుకు ఈ నియోజకవర్గంలో సంబంధాలున్నాయి. ఈ సంబంధాలు, సామాజిక తరగతిని దృష్టిలో పెట్టుకొని పెందుర్తి నుంచి పోటీ చేయాలన్న ప్రయత్నంలో వున్నారు. జనసేన పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తమ్మిరెడ్డి శివశంకర్ కూడా పోటీచేయాలన్న ఆలోచనలో వున్నారు. ఇదిలావుంటే టిడిపి నుంచి ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని కాదని ఆ సీటు జనసేనకు కేటాయించే అవకాశంలేదని ఆ పార్టీ శ్రేణులు కుండబద్దలుగొట్టినట్లు చెబుతున్నాయి. ఇదే జరిగితే పంచకర్ల, శివశంకర్ ఎక్కడ నుంచి పోటీచేస్తారన్న చర్చ జరుగుతోంది.

పాయకరావుపేట నుంచి గత ఎన్నికల్లో టిడిపి తరుపున డాక్టర్ బంగారయ్య పోటీచేసి ఓడిపోయారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత పోటీచేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ నుంచి జనసేన నుంచి శివదత్తు పోటీచేయాలని ప్రయత్నిస్తున్నారు. నర్సీపట్నం నుంచి జనసేన తరపున రాజాన వీరసూర్య చంద్ర పోటీచేయాలని ప్రయత్నిస్తున్నా మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సిహెచ్.అయ్యన్నపాత్రుడుకు కేటాయించనున్నారు. చోడవరం నుంచి గతంలో జనసేన నుంచి పోటీ చేసిన పివిఎస్ఎన్.రాజు వచ్చే ఎన్నికల్లో పోటీచేయాలని చూస్తున్నారు. ఇక్కడ టిడిపి నుంచి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు పోటీపడుతున్నారు. మాడుగుల నుంచి జనసేన తరుపున పోటీ చేయాలని సయ్యపురెడ్డి కృష్ణ ఒకవైపు ప్రయత్నిస్తున్నారు. ఈ నియోజకవర్గంలో టిడిపి నుంచి మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పివిజి.కుమార్, పైలా ప్రసాదరావు పోటీపడుతున్నారు. అనకాపల్లిలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు టిడిపి నుంచి పోటీచేయాలని ప్రయత్నిస్తుండగా, జనసేన నుంచి పరుచూరి భాస్కరరావు పోటీ చేయాలన్న యోచనలో వున్నారు.

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో భద్రతా పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేశారు. 07466 రాజమండ్రి - విశాఖపట్నం ప్యాసింజర్, 07467 విశాఖపట్నం - రాజమండ్రి ప్యాసింజర్ ప్రత్యేక రైలు, 17239 గుంటూరు - విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17243 గుంటూరు - రాయగడ ఎక్స్‌ప్రెస్, 17219 మచిలీపట్నం - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌లను సెప్టెంబర్ 18 నుంచి 24 వరకు రద్దు చేశారు. 17240 విశాఖపట్నం - గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17244 రాయగడ -గుంటూరు ఎక్స్‌ప్రెస్, 17220 విశాఖపట్నం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లను సెప్టెంబర్ 19 నుంచి 25 వరకు రద్దు చేశారు. అదేవిధంగా 22701 విశాఖపట్నం - విజయవాడ ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 విజయవాడ - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను సెప్టెంబర్ 18, 19, 20, 22, 23 తేదీలలో రద్దు చేశారు.

13351 ధన్‌బాద్ - అలెప్పీ బొకారో ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 17 నుంచి 22 వరకు, 12889 టాటానగర్ - ఎస్ఎంవి బెంగళూరు ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 22న, 18111 టాటా - యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 21న, 12835 హతియా - ఎస్ఎంవి.బెంగళూరు ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు, 12376 జసిదిహ్ - తాంబరం ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 20న, 22837 హతియా - ఎర్నాకులం ఎసి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబర్ 18న సాధారణ మార్గం నిడదవోలు -ఏలూరు - విజయవాడ మీదుగా కాకుండా నిడదవోలు - భీమవరం టౌన్ -గుడివాడ - విజయవాడ మీదుగా దారి మళ్లించిన మార్గంలో నడుస్తాయి. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని రైల్వే శాఖ అధికారులు అభ్యర్థించారు.

వైశాఖి నృత్యోత్సవం.. అదరహో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యాన కళాభారతి ఆడిటోరియంలో జరుగుతున్న మూడు రోజుల వైశాఖి నృత్యోత్సవ్ అదరహో అనిపిస్తోంది. రెండో రోజైన శనివారం సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో పేరిణి, కూచిపూడి, భరతనాట్యం, సంబల్‌పురి ప్రదర్శనలు దేని కవే తన విశిష్టత చాటు కున్నాయి. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బత్తిన రంగ విక్రమ్ కుమార్ (గౌడ్) నిర్దేశకత్వంలో అత్యంత క్రమశిక్షణగా ఈ ఉత్సవ ప్రదర్శనలు జరుగుతున్నాయి. అతిథులు కళాకారులను సత్కరించారు.

రంపచోడవరంలో దీక్షలు చేస్తున్న టిడిపి నేతలు

నాలుగో రోజుకు టిడిపి రిలే దీక్షలు

ప్రజాశక్తి - రంపచోడవరం : అక్రమ కేసులో జైలు పాల్జేసిన చంద్రబాబును తక్షణమే విడుదల చేయాలని కోరుతూ వై రామవరం మండలం తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు కోరారు. స్థానిక టిడిపి కార్యాలయం వద్ద నాలుగవ రోజు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. 'నియంతపై పోరాటంలో మేము సైతం' అంటూ నినదించారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి పాల్గొన్నారు. సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబు, రమేష్ దీక్షకు సంఘీభావం తెలిపారు.

రాజవొమ్మంగి: చంద్రబాబు అక్రమ అరెస్ట్‌తో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని, వైసిపి ఆరాచక పాలనపై పోరాటానికి ప్రజల మద్దతు ఇవ్వాలని టిడిపి అరకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దంతులూరి శివరామచంద్రరాజు, మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు కోరారు. చంద్రబాబు అరెస్టు ఖండిస్తూ శనివారం రాజవొమ్మంగిలో నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా శివాజీరాజు, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు జి.పెద్దిరాజు ఎం డింబకేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో అవినీతి వైసిపి పాలనను అంతమొందించడానికి టిడిపికి జనసేన మద్దతు ఇవ్వడం, వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేయడం శుభసూచకమన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు జి రమణి, ఎల్ లక్ష్మణరావు, పి సత్యనారాయణ, ఎం మోహన్, సావిత్రి, శ్రీను సత్యనారాయణ, జె మధు, గోపి, జనసేన మండల అధ్యక్షులు బి త్రిమూర్తులు, పలువురు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఓజోన్ పొర పరిరక్షణ అవసరం

ప్రజాశక్తి- చింతూరు : చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం , రసాయన శాస్త్రం, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రత్నమాణిక్యం మాట్లాడుతూ సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమి మీద పడకుండా ఓజోన్ పొర అడ్డుకుంటుందన్నారు. దీన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎమ్ శేఖర్ మాట్లాడుతూ విపరీతమైన కాలుష్యం, విచ్చలవిడి రసాయనాల వినియోగంతో ఓజోన్ పొరకు ముప్పు కలిగించే చర్యలు తీవ్రమౌతుండడం మానవాళికి, భూమిపై ఉన్న జీవరాశులకు, పర్యావరణానికి హానికరమన్నారు.. వృక్ష విభాగాదిపతి డాక్టర్ వై పద్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.హారతి ఓజోన్ పొర ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో అధ్యాపకులు జి. వెంకట్రావు, కె. శైలజ ఎస్. అప్పనమ్మ, కె. శ్రీదేవి, కె.శ్రీలక్ష్మి, ఆర్. మౌనిక, పి. గౌతమి , జి. సాయికుమార్, పి.ఏడుకొండలు పాల్గొన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.